క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే మండల సభకు వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



రఘునాథపల్లి: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గోవర్ధనగిరిలో మండల వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు ముసిపట్ల నరేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ యూత్ అధ్యక్షుడు పిట్టల అర్జున్, గ్రామ శాఖ అధ్యక్షుడు ముసిపట్ల కుమార్, బేజాడి కృష్ణ, అమనగంటి కుమార్ పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన అనంతోజు రామాచారి వర్ధంతి సందర్భంగా ఫేత్ క్రైస్ట్ టెంపుల్ ఐసీసీవైడబ్ల్యూ మినిస్ట్రీస్ డైరక్టర్ రక్షిత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. రామాచారి కుమారుడు యోగానంద, ఆస్పత్రి వైద్యాధికారులు చేతుల మీదుగా రోగులకు, బాలింతలకు, పండ్లు అందజేశారు. డాక్టర్ ఉమ, ఖయ్యూం, వైద్య సిబ్బంది ఉన్నారు.

నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయండి

జనగామ రూరల్: నాయీబ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకొని పట్టించుకోవడం లేదని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అభినాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల్లోని అట్టడుగు సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. శ్రీరాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యమకారుడి మృతి



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆంజనేయులు (50) మంగళవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగాలఘణపురం మండలం ఏర్పడి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, అధికారుల పనితీరుపై అప్పట్లో మండల కేంద్రంలో ఆంజనేయులు రిలే నిరాహార దీక్ష చేసి అధికారుల్లో కదిలిక తెచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అయినప్పటికీ టీడీపీని వీడలేదు. మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహాన్ని నెల్లుట్లలో ఏర్పాటు చేసి ఉద్యమానికి స్ఫూర్తిని కలిగించాడు. ఆయన మృతి పట్ల మండలంలోని పలువురు సీనియర్ నాయకులు, నెల్లుట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

రఘునాథపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పులి శ్రీనివాస్ (52) మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆరోగ్యం సహకరించక పురుగుల మందు తాగాడు. స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

జనగామ రూరల్: కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ధర్మకంచకు చెందిన మారపాక వినోద్ కుమార్ (35) టైలర్ వృత్తి చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం సరిగాలేక ఆర్థికంగా మనోవేదనకు గురై ఇంట్లోని రేకుల షెడ్‌లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాపర్‌వైరు చోరీ

బచ్చన్నపేట: అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో కాపర్‌వైరును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని సాల్వాపూర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ట్రాన్స్‌కో ఏఈ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రాత్రి వేళ కరెంటు ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్‌వైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టడంతో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే రైతులు పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

‘ఉపాధి’ని వినియోగించుకోవాలి



బచ్చన్నపేట: కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ



స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ ఉమాసుధీర్‌రెడ్డి

బచ్చన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జాబ్ కార్డు కలిగిన వారు తప్పక వినియోగించుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మన్‌సాన్‌పల్లిలో చేపడుతున్న ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు. అలాగే కూలీల మస్టర్ కాపీలను పరిశీలించి మస్టర్‌లో పేర్లు ఉన్న సభ్యులందరూ పనులకు వచ్చారా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ రికార్డులను తనిఖీ చేశారు. సర్పంచ్ పంజాల తార, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, కారోబార్ శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.



తరిగొప్పుల: ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అర్జుల రమాసంపత్‌రెడ్డి

తరిగొప్పుల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని జాబు కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ అర్జుల రమాసంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని అబ్దుల్ నాగారంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. వేసవి కాలం నేపథ్యంలో కూలీలకు తాగునీరు, సేద తీరేందుకు టెంట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ బాషబోయిన రమేష్‌కు సూచించారు. పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులకు హాజరైన కూలీలకు సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ద్రావణం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తమ వంతుగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, ఉపసర్పంచ్ మారపాక రాములు, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ తాటికొండ రేణుక, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

రఘునాథపల్లి: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి ఒక వరం లాంటిదని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం 104 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాలకు కేసీఆర్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే..

మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తహసీల్దార్ ఎండీ అన్వర్, రైతుబంధు మండల కన్వీనర్ గొరిగె రవి, జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్, కంచనపల్లి విండో చైర్మన్ రవీందర్, సర్పంచ్‌లు ఎండీ హయత్‌అలీ, వెంకట్‌నాయక్, ఎంపీటీసీ దేవేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కురుమ సంఘం నాయకులు మంగళవారం మున్సిపల్ చైర్మన్ పోకల జమున, మున్సిపల్ కమిషనర్ రజితకు వినతిపత్రం అందజేశారు. జనగామ చౌరస్తాలో విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్‌లో తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిరాములు, ఆలేటి రాజు, జాయా మల్లేష్, శ్రీనివాస్, సోమయ్య, బీరప్ప, ఆంజనేయులు, సిద్దులు, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బలగం సినిమా ప్రదర్శన

పాలకుర్తి టౌన్: సమాజంలో మానవతా విలువలను ప్రేమ బంధాలను పెంచేందుకు ‘బలగం’ సినిమా ఎంతో దోహదపడుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ అన్నారు, మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో, శాతాపురంలో పసునూరి నవీన్, గంట రవీందర్ ఆధ్వర్యంలో ‘బలగం’ సినిమాను ప్రదర్శించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



బలగం చిత్రం చూస్తున్న ప్రజలు

బాధిత కుటుంబాలకు పరామర్శ



లింగాలఘణపురం: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం: మండలంలో లింగాలఘణపురం, కొత్తపల్లి, నెల్లుట్లలో మృతి చెందిన బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి రూ.5వేల చొప్పున రూ.20వేల ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలో టీఆర్‌ఎస్ నాయకుడు కారంపురి శ్రీనివాసు ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా నెల్లుట్లలో కాల్వ అంజనేయులు, బొట్ల ఆంజనేయులు, కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిళ్లపురం యాదగిరి తండ్రి మల్లయ్య మృతి చెందగా మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. నాగేందర్, నాయకులు రాజు, గోవర్ధన్, కుమారస్వామి, ఆంజనేయులు, శ్రీనివాసు, ఉపేందర్, విష్ణు, స్వామితోపాటు పాల్గొన్నారు.

సంఘం సభ్యుడి కుటుంబానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన రాజరాజేశ్వరి సంఘం సభ్యుడు గట్టు రాజు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందించారు. సంఘం అధ్యక్షుడు ఇల్లందుల ప్రతాప్, కోశాధికారి గన్ను నర్సింహులు, కార్యదర్శి గట్టు రమేష్ పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కలకోల లక్ష్మి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ కలకోల ఎప్పలయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుగులోత్ మధు, మంతెన రాజు, కలకోల చొక్కయ్య, బోగం శ్రీను, దారం శ్రీను ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఫొటోగ్రాఫర్లు

దేవరుప్పుల: హైదరాబాద్‌లో ఫొటోగ్రఫీ ప్లీనరీ సమావేశానికి ఆ సంఘం ఆధ్వర్యాన మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్లు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సింగరాజుపల్లిలోని అల్లూరి సీతారామ రాజు విగ్రహం వద్ద నినాదాలు చేస్తు బయలు దేరారు. మండల అధ్యక్షుడు వీరు నాయక్, గౌరవ అధ్యక్షుడు నల్ల లక్ష్మీపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సోమేష్, కోశాధికారి నోముల సతీష్, ఉపాధ్యక్షుడు నల్ల సతీష్, నాగరాజు, సుదీర్‌కుమార్, నరేందర్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

బియ్యం వితరణ

జనగామ రూరల్: పట్టణానికి చెందిన ముత్తటి రితిక ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వర్ధన్ ఆశ్రమంలో మంగళవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ముత్తటి రాజారెడ్డి స్రవంతి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, పండ్లు వితరణ చేశారు. అమ్మ టీం సభ్యులు మంతెన మణి, బీంరాజ్, అభిరాం, కిట్టు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన



పాలకుర్తి టౌన్: అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి దయాకర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన పెట్రోలు బెంచ్‌లు, ఎల్‌పీజీ, గ్యాస్, గోదాముల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది కిరణ్‌కుమార్, శ్యామ్‌సుందర్, అశోక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



జనగామ రూరల్: గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి ఇచ్చిన తనకు న్యాయం చేయాలని కడవెండికి చెందిన పైండ్ల సోమయ్య ఎన్పీడీసీఎల్ ఎస్ఈకి మంగళవారం వినతి పత్రం అందజేశాడు. మండలంలోని కడవెండి గ్రామంలో 33.11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామానికి చెందిన పైండ్ల సోమయ్య సర్వేనంబర్ 472 ఏ1లో ఎకరం భూమిని 2011లో విద్యుత్ శాఖకు అందజేశాడు. అప్పటి అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ బోయిన సత్తయ్య నష్ట పరిహారం ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని వాపోయాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరాడు.

పేదలకు ఎల్‌ఓసీ సంజీవని లాంటిది



ఎల్‌ఓసీ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ సంజీవనిలాంటిదని, ఆపదలో ఉన్న వారికి వైద్య చికిత్స కోసం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలో కడియం నివాసంలో మంగళవారం పలువురు బాధితులకు ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను అందజేశారు. సముద్రాల గ్రామానికి చెందిన తోటకూరి సునీత, దీకొండ ఉమ, బాస్కుల విన్సీప్రియ, సిరిపురం గ్రామానికి చెందిన కొరెపల్లి శ్రీనివాస్‌రెడ్డికి నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.2.50లక్షల చొప్పున రూ.10లక్షల ఎల్‌ఓసీ మంజూరు పత్రాలను శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణలో అనారోగ్యంతో ఆపదలో ఉన్న నిరుపేదల కోసం సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ ద్వారా పేదలపక్షపాతిగా ఆదుకుంటున్నారని అన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత్ కరెన్సీపై ముద్రించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరుశరామ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి 138వ జ్ఞానమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అలాగే రాష్ట్ర అసెంబ్లీలో ఆయన ఫొటో ముద్రించాలని బిల్లు పెట్టి తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని కోరారు. తిప్పారపు ప్రసాద్, కనకరాజు, ఎల్లేష్, శ్రీను, నందు, రామకృష్ణ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

దేవరుప్పుల: మండల కేంద్రంలో శివ నామకరణానికి ప్రతీకగా ఏటా కొనసాగే ఉప్పల మల్లన్న జాతరను పురస్కరించుకొని మంగళవారం రాత్రి భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. స్థానిక పద్మశాలీలు, ఇతర సామాజిక వర్గాల కుల పెద్దలు దేవతామూర్తుల విగ్రహాలను పల్లకిలో ఎదుర్కోలు నిర్వహించి కల్యాణానికి తీసుకెళ్లారు. వేదపండితులు కల్యాణం నిర్వహించారు. పూజారి పెద్దనుకం వెంటేశ్వర శర్మ, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళం అందజేత



దేవరుప్పుల: విరాళం అందజేస్తున్న సుకేందర్



రఘునాథపల్లి: విరాళం అందజేస్తున్న ఇందిర

దేవరుప్పుల: దేవరుప్పులలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు మండల కేంద్రానికి చెందిన ఏల సురేందర్ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేసి భక్తిని చాటుకున్నాడు. ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞత తెలిపారు. ప్రతి ఒక్కరు బొడ్రాయి ప్రతిష్ఠాపనకు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ భిక్షపతి, మండల రైతు కో ఆర్డినేటర్ నర్సింహారెడ్డి, దశరథ, కిష్టయ్య, సత్తయ్య, వెంకటేశ్వర్లు, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి..

రఘునాథపల్లి: మండలంలోని కన్నాయపల్లిలో నూతనంగా నిర్మించే దుర్గామాత ఆలయానికి టీపీసీసీ కార్యదర్శి, నియోకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర మంగళవారం రూ. 10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఈసారి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ నియోజకవర్గంలో జెండా ఎగిరేలా కార్యకర్తలు మరింత కష్టపడాలని కోరారు. జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, రవిగౌడ్, కొంరెల్లి, భాస్కర్, భిక్షపతి ఉన్నారు.

గిరిజనులపై దాడులు చేస్తే సహించం

చిల్పూరు: ఇటీవల గిరిజనులపై దాడులు ఎక్కువయ్యాయని, ఇక నుంచి అలా జరిగితే సహించేది లేదని లంబాడి హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ నునావత్ సుమన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం, నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా బానోత్ బాలరాజు, చిల్పూరు మండల అధ్యక్షుడిగా భూక్య రాంచంద్రం, మహిళా మండల అధ్యక్షురాలిగా భూక్య కమిలి బాయిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్ నాయకత్వంలో ముందుడి పనిచేస్తామన్నారు. సాదం గట్టయ్య, భూక్య యాదగిరి, రాజు, కుమార్, జ్యోతి, లలిత పాల్గొన్నారు.



నూతన కమిటీతో సుమన్‌నాయక్

హక్కుల సాధనకు రాజీలేని పోరాటం



రఘునాథపల్లి: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



కొడకండ్ల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న మదార్ తదితరులు

కొడకండ్ల: రజకుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేద్దామని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదునూరి మదార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు సట్టు సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ నెల 29,30 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దూదిగాని నాగరాజు, లింగయ్య, తాడూరి రాములు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: ఈనెల 29, 30 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే మూడో రాష్ట్ర రజక మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని కంచనపల్లి, గబ్బెట, కన్యాపల్లి, కోడేరు గ్రామాల్లో బుధవారం మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ రజక కుటుంబాలు ఐక్యతతో కదిలి రావాలన్నారు. శ్రీనివాస్, గట్టేషం, వెంకటేశ్వర్లు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



తరిగొప్పుల: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసే దళిత రత్న అవార్డును మండలకేంద్రానికి చెందిన బహుజన సోషలిస్టు పార్టీ నాయకుడు గద్దల కిషోర్ ఇటీవల స్వీకరించాడు. కాగా, సర్పంచ్ దామెర ప్రభుదాస్ ఆధ్వర్యంలో మంగళవారం కిషోర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ భూక్య జుంలాల్‌నాయక్, చిలువేరు లింగం, ఉపసర్పంచ్ అంకం శ్రీనివాస్, కాత టోని,ఆవుల రాములు, దామెర జోసఫ్, ఎడ్ల నవీన్ , జంగ వీరయ్య ,లింగయ్య దామెర బంటి, చింతల రవి, మామిడాల రవి, సాయిలు పాల్గొన్నారు.

‘ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు..’

- కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

తరిగొప్పుల: తన కుమారుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని, అతని చావుకు కోడలు కారణమని మండలంలోని కొత్తతండాకు చెందిన భూక్య చంద్రభాను, పక్రి అనుమానం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ కుమారుడు భూక్య రవి (47) గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్ విధులు నిర్వర్తిస్తున్నాడని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గాయత్రినగర్‌లోని ఇంట్లో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడని తెలిపారు. కాగా, తమ కుమారుడి ఒంటిపై నోటితో కొరికినట్లు, తీవ్రంగా కొట్టినట్లు గాయాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొడుకు భూక్య రవి, కోడలు భూక్య రజని మధ్య కుటుంబ తగాదాలు జరిగాయని తెలిపారు. హనుమకొండలో ఇల్లు నిర్మించడానికి తీసుకొచ్చిన అప్పు తీర్చడానికి గ్రామంలో ఎకరం వ్యవసాయ భూమిని విక్రయించామన్నారు. రవికి ఇటీవలే జూనియర్ లైన్‌మన్‌గా పర్మినెంట్ అయ్యిందన్నారు. ఇలాంటి నేపథ్యంలో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడని కోడలు రజని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం బాధాకరమని తెలిపారు. సంబంధిత పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకొని కొడుకు మృతికి కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు. విజయ, మిట్టు ఉన్నారు.



సెల్‌ఫోన్‌లో తమ కొడుకు ఒంటిపై గాయాలను చూపిస్తున్న మృతుడి తల్లిదండ్రులు